భూభారాన్ని మోసే ఆదిశేషుడిలా, జనభారాన్ని మోసికొచ్చిన, ప్యాసింజరు కృష్ణాపురంలో ఆగింది. స్టేషనులో జనం చాలారద్దీగా ఉన్నారు. "ఇక్కడ ఐదు నిముషాలే హాల్టు అయినప్పటికి మల్లెపూలు మామిడిపండ్లు బుట్టలు లోడ్ చేస్తున్నారు. రైలు కదలబోయేసరికి అరగంట పట్టవచ్చు" అని చెపుతున్నాడు తెలుసుకుని వచ్చిన తోటి ప్రయాణీకుడు. నాకు

# బొగన్‌విలియం

సీట్లో కూర్చుని కూర్చుని విసుగు పుట్టింది. మాఊరు వెళ్ళాలంటే ఈ ప్యాసింజరే గతి. ముష్టివాళ్ళబండీ ప్రతి ఇంటిముందూ ఆగినట్లు, ఈ రైలు ప్రతీస్టేషనులోనూ ఆగడమే ! అనుకున్నాను. అంత విసుగులోనూ నవ్వు వచ్చింది.

"నిన్ను చూసి సంవత్సరం దాటింది. కళ్ళుకాయలు కాచిపోతున్నాయి. ఓమాటు రారా ! నీకొడుక్కి ఇక్కడే సంబంధం కూడా ఉంది. చూసుకో వచ్చు" అని అమ్మ నాన్నగారు ఉత్తరాలు తెగ వ్రాయడంతో బయల్దేరకతప్పలేదు. నాన్నగారు వ్యవసాయం చూసుకుంటూ, స్వంత ఊళ్ళోనే స్థిరపడ్డారు. ఈ వృద్ధాప్యంలో మీరు ఒంటరిగాఇక్కడ ఎందుకు ? నాదగ్గరకే వచ్చేయండి, అని ఎన్నిమార్లు పిల్చినా : "ఎందుకులే నాయనా ! మా తనువులు ఇక్కడే తెల్లారిపోనీ, ఆపట్నాల్లో ఓ మడా ! తడా ! " అంటారు. కాసేపు అటూ ఇటూ తిరుగుదామని ; ఎయిర్ బ్యాగు బుజానికి తగుల్చుకుని క్రిందికిదిగేను. ఆ చిన్న స్టేషనులో ప్రతీ బోర్డూ చదూతూ, బొమ్మల్ని చూస్తూ, ప్లాటుఫారం చివరివరకూ నడకసాగించేను 'దేశసౌభాగ్యానికి చెట్లు నాటండి,' 'మీ బిడ్డల ఆరోగ్యానికి గొల్లభామపాల డబ్బాలనే వాడండి.' 'ఇద్దరుబిడ్డలుచాలు, ముగ్గురువద్దు' — నవ్వువచ్చింది.

టీ స్టాలు ప్రక్కన రాటకు కట్టబడిన తడికెమీద, ఒక పోస్టరు అతికించిఉంది. అది డాన్సుపోజులో ఉన్న అమ్మాయి బొమ్మ. క్రింద 'ప్రఖ్యాత నర్తకి రాధిక' అని వ్రాసి ఉంది. ఎప్పుడో ఎక్కడో చూసిన గుర్తులు, ఆ అమ్మాయి వదనంలో గోచరించేయి. రాధిక అనే పేరు విన్నట్లు, కొద్దిగా పరిచయం ఉన్నట్లు, లీలగా అనిపించసాగింది. తదేకంగా అటేచూడ్డంతో నామనస్సు ముప్పై సంవత్సరాలు గతంలోకి వెళ్ళిపోయింది .....

ఇలాంటి అమ్మాయినే ఒకమారు పెళ్ళిచూపుల్లోచూసేను ఆ అమ్మాయి పేరు రాధ అనిచెప్పేరు. అదేరూపం అదేపోలిక కొచ్చినట్లు గోచరిస్తూంది ఆ రోజు వాళ్ళ ఇంట్లోపాలకోవా పకోడీలూ ఇచ్చేరు. అప్పటి రాధరూపం ఎన్నాళ్లో నన్ను వెంటాడింది. అప్పుడే నాడైరీలో ఆమె రూపం అవుట్‌లైనుగీసేను. అప్పటి రాధ వయస్సు పావడా — పైట వాణీలోనే ఉంది. ఆ అమ్మాయిలాగే ఉంది. ఎవరీ రాధిక ? నాలో కుతూహలం పెరిగింది.

"టీ కావాలా సార్."

"ఆ!" పరధ్యాహ్నంగానే అన్నాను.

"ఈ బోర్డు ఏమిటి ? " టీ త్రాగుతూనే అడిగేను.

"ఈ అమ్మాయి ఈ రోజు రాత్రి, ఈఊళ్ళో డాన్సుచేస్తుంది. గ్రామదేవత పండుగు జరిపిస్తున్నారు వాళ్ళగ్రూపు పదిమంది అందరూ అమ్మాయిలే ! ఖచ్చితంగా రెండు వేలుపుచ్చు కుంటుంది. చుట్టు ప్రక్కల ఊళ్ళనుంచి జనం తిరగబడిపోతారంటే నమ్మండి. ఈరెండు మూడు రోజులూ బేరం బలేగా ఉంటుంది " అన్నాడు సంతోషంగా !

"ఇక్కడనుంచిఊళ్ళోకి ఎంతదూరం"

"నాలుగు కిలోమీటర్లు అయినా బస్సులు ఉన్నాయిలెండి."

వైశాఖమాసం ఎండ వేడిగాడ్పు కొడుతూంది. మనస్సు అటే ఆలోచిస్తూంది. చల్లటినీళ్ళతో ముఖప్రక్షాళన గావించేను. పద్మవ్యూహాన్ని ఛేదించుకొని బస్సులో పడ్డాను.

ఊళ్ళోకివెళ్ళేసరికి పన్నెండుగంటలు దాటింది. ఎక్కడచూసినా అమ్మవారి ఘటాలూ, పులివేషాలూ, మొదలైన వాటితో, ఊరు కోలాహలంగాఉంది. గోడలమీద పోస్టర్లలో, రాధిక బొమ్మ రకరకాల పోజుల్లో, చూడ ముచ్చటగా గోచరిస్తూంది. ఓ కిల్లి కొట్టు దగ్గర వాకబుచేసేను. ఏదేనా లాడ్జి దొరుకుతుందా ? అని.

"అలాంటివేం లేవు కరణంగారి ఇంటికివెళ్ళండి" అని ఎలావెళ్ళాలో గుర్తులు చెప్పేడు. కరణం ఇల్లు కనుక్కోడం కష్టమేంలేదు. అది ఊరంతటికీ పెద్దఇల్లు.

"కరణంగారి ఇల్లు ఇదేనా ?" వీధిలోనొకర్ని అడిగేను.

"ఆ ! రండి" అన్నాడు.
"ఎవరో వచ్చేరు బాబయ్యా !" అని నన్ను చూపించేడు.

పెద్దపెద్ద బుగ్గమీసాలూ, సిల్కుపంచె లాల్చీ, గంభీరమైన విగ్రహం వీధిగుమ్మంలోనే ఎవరితోనో మాట్లాడుతున్నాడు కరణం.

"కూర్చొండి, ఎక్కడి నుంచి వస్తున్నారు?"

"హైదరాబాద్ నుంచి. అక్కడ లెక్చరరుగా ఉంటున్నాను. ఆమ్మ నాన్నగార్ని చూడ్డానికి వెళుతున్నాను...."

"రతీమన్మథ" డాన్సు చూసి వెళ్ళాలని ఇక్కడదిగేరు. అంతేనా?" నవ్వుతూ మధ్యలోనేఅందుకున్నాడు.

రసికుడే అనుకున్నాను.

"పిల్లలు ఎంతమంది మీకు?" మళ్ళీ ప్రశ్నించేడు.

"అక్షరాలా కుటుంబనియంత్రణ మా ఇంట్లో అమల్లో వుంది లెండి. పెద్దవాడు బి.ఎ. రెండోవాడు పదవ తరగతి" అన్నాను. ఇద్దరం నవ్వుకున్నాం.

"ఈ రోజు ఉండడానికి నాకేదేనా

గది చూపించగలరా ?"

మీకు అభ్యంతరం లేకపోతే మా ఇంట్లో ఉండండి"

"అంతకంటేనా ?" కృ త జ్ఞ త చెప్పుకున్నాను.

నౌకరు మేడమీదకు తీసికెళ్ళేడు. గదిచూపించేడు. కాలకృత్యాలుతీర్చుకునిస్నానం ముగించేను. విశ్రాంతిగా మంచంమీద వాలిపోయేను....

ఒక స్త్రీ ఆమ్మవారి ఘ ట ం తల మీద పెట్టుకొని, వేపమండలు చేత్తో పట్టుకుని నృత్యం చేసి చేసి, ఒక్కమారు నా వెన్ను మీద వేప మండతోకొట్టింది. నాకు మెలుకువ వచ్చింది.నౌకరు భోజనానికి లేపుతున్నాడు. ఒ క స్త్రీ ప ళ్ళె ం తో భోజనం తెచ్చి బల్లమీద పెట్టి వెళ్ళింది....

స్వప్నంగురించే ఆలోచిస్తున్నాను నాలుగు గంటలకు నౌకరు కాఫీ పలహారంతో ప్రత్యక్ష మయ్యేడు.

"ఏమిటి ఈ మర్యాదలు ఇంటి వారికి అనవసరమైన శ్రమ!"

''బలేవారే ! ఈ ఊరు ఎవరు వచ్చినా ఇక్కడ దిగవల్సిందే! భోజనం చెయ్యవల్సిందే! లేకపోతే బాబుగారు ఊరుకోరు. అమ్మగారు చాలా మంచివారు. డాన్సు చెయ్యబోయే అమ్మాయి లందరికీ ఇక్కడి నుంచే భోజనాలు, కాఫీ పలహారాలు కూడా వెళ్ళేయి." అన్నాడు.

"ఈ రాత్రి డాన్సు చెయ్యబోయే వాళ్ళకా ! అప్పుడే వచ్చేరా ! ఇంకా రాలేదనుకుంటున్నాను. వాళ్ళుఎక్కడ దిగేరో నాకు చూపించగలవా?"

"ఓ రండి అవతల వీధివో ఉన్న కరణంగారి చిన్న ఇంట్లోనే....''

నేను వెళ్ళేసరికి రాత్రి చెయ్యబోయే నృ త్యా ని కి అవసరమైన డ్రెస్సులూ, నగలూ తీసి పెట్టుకుంటున్నారు. రాధిక నన్నుకూర్చోమని కుర్చీ చూపించింది. వినయంగా నమస్కరిస్తూ, తానుకూర్చుంది. ఆమెలో

సంస్కారం ఉట్టిపడుతూంది నేను ఆశ్చర్యంగా రాధిక రూపమే చూస్తు న్నాను.

"నీ పేరు ఏ మి ట మ్మా ?" ప్రశ్నించేను.

"రాధిక" వీణమీటినట్లుగా విని పించింది.

"ఓ మాట అడుగుతాను ఏం అనుకోకమ్మా! నీతండ్రిలాంటివాణ్ణి"

"పర్వాలేదు, అడగండి"

"మీ అమ్మ పేరు రాధకదూ?"

"అవును మీకెలా తెలుసు ?" ఆశ్చర్యంగా చూస్తూ అంది.

"నేను మీకు దూరపు బంధువిని చాలా కాలం అయిందిలే అమ్మా, చూపులు లేవు. మీ నాన్నగారు ఏం చేస్తుంటారు?"

ఏం చేస్తూంటారో ఎక్కడ వుం టారో తెలీదు. మా దగ్గర మాత్రం కాదు"

నా నెత్తిమీద పి డు గు పడ్డట్లు అనిపించింది. దాంతో నాకు రాధని త్వరగా కలుసుకోవాలనీకుతూహలం ఎక్కువైంది.

"నన్ను మీ వూరు తీసికెళ్ళ గలవా? మీ అమ్మని చూసి చాలా కాలం అయింది.

"క్షమించండి ! మరో రెండు వూళ్ళల్లో నా ప్రోగ్రాం వుంది. వెం టనే వె ళ్ళా లి. మీరు వెళ్ళండి." అంటూ కార్డు ఇచ్చింది.

కరణానికి నా కృతజ్ఞతలు చెప్పి బయల్దేరేను. కాకినాడ వెళ్లి ఎడ్రెసు ప్రకారం ఇల్లుతెలుసుకున్నాను. చు ట్టూ ఆవరణ. రకరకాల పూలమొ క్కల మధ్య చిన్నఇల్లు పొందికగా ఉంది. ఇరుప్రక్కలా ఉన్న రంగు రంగులబూగన్‌విలియా చెట్లు, గేటుని ఆర్చిలా ఆవరించేయి. అనుమాన నివృత్తికోసం మరోమారు, ఇంటి

నెంబరు చూసి. తలుపు తట్టేను. పనిమనిషి తలుపుతెరచింది కుర్చోండి అమ్మగార్ని పిలుస్తాను'' అని కుర్చీ చూపించింది. ఆ గ ది లో రెండు కుర్చీలు, సోఫా, మధ్యన టీపాయి మీద ఫ్లవర్ వేజ్ దానిలో బూగన్ విలియా పువ్వులు, అందంగాఅమర్చి ఉన్నాయి.

రాధచేతులు జోడించి 'నమస్కా-రం' అందిరాధ వదనంలోకి పరీక్షగా చూసేను. చాలా మారిపోయింది. కళ్ళచుట్టూ నలుపు, అక్కడక్కడ జుట్టునెరిసింది. సాదా నేతచీరకట్టు కుంది. నుదుటకుంకుమ ఉదయించిన బాల సూర్యుడిలాఉంది. ఆమెరూపం గతించిన జీవితంలో, అనుభవాల కూడికకు ప్రతీకలా కనిపించింది.

"నన్ను గుర్తించలేదా ? ముప్ఫై సంవత్సరాలక్రిందట అమ్మ నాన్న గారితోకలిసి పె ళ్ళి చూ పు ల కు వచ్చేను ! " అన్నాను.

నా వేపు ఒక్కమారుచూచి, టీ పాయి మీద ఉన్న ఫ్లవర్ వేజ్ మీదకుదృష్టి మళ్ళించింది.

"మీ పేరు మోహన కృష్ణగారు కదూ ? ఉండండి ఇప్పుడే వస్తాను."

లోపలికి వెళ్ళి ఓకరు తెచ్చి నాచేతిలోఉంచింది. లోపలి కాగితం తీస్తూంటే, నాచేతిలోనే రె ం డు ముక్కలు అయ్యింది. జాగ్రత్తగా దగ్గరచేర్చి చదివేను. ఒకే ఒక్క-వాక్యం

రాధా !

నా జీవిత భాగస్వామిని నువ్వే !

నీ కృష్ణ

"ఇది ఇంకా దాచేవా ? అన్నాను

"చించి పారెయ్య గలను. కాని గుండెలో నిలుపుకున్నాదో ?" అంది

ఏ భావం ముఖంలో కనిపించ లేదు. నిర్వికారంగాచెప్పింది పువ్వుల వేపే చూస్తూ, నాగుండెలో అగ్ని

పర్వతం బ్రద్దలైంది. ఏమీ మాట్లాడ లేకపోయేను.

"అప్పట్లో మీకోసం ఎదురు చూసేను. వస్తారన్న నమ్మకంతో !? అంది రాధ నిశ్శబ్దాన్ని చీలుస్తూ.

"అమ్మ నాన్నగారికి ఇష్టం లేక పోయినా నిన్నే చేసుకోవాలన్న నిర్ణయంతో మీఊరు వచ్చేను. మీ ఇంటితలుపు తట్టేను. ఒకస్త్రీ తలుపు తెరిచింది. మీగురించి అడిగేను. హఠాత్తుగా మీనాన్నగారు పోయేరని మీమామయ్య మిమ్మల్ని తీసికెళ్ళే డని, అంతకన్న వివరాలు తెలీవని చెప్పింది. మీరు ఏఊరు వెళ్ళారో అని, ఆ వీధిలో ఇద్దరి ముగ్గుర్ని అడిగేను. అమలాపురం అని ఒకరు, రాజమండ్రి అని ఒకరు చెప్పేరు. ఆఊళ్లూవెళ్లేను. మీజాడ తెలుసుకో లేకపోయేను. ఏదీ నిశ్చయించుకో లేక పెళ్లివాయిదాలేస్తూ వచ్చేను. ఎమ్. ఎ. పూర్తయింది. ఉద్యోగం లో స్థిరపడ్డాను. బెంగతో అమ్మ మంచంపట్టింది. వివాహం చేసుకోక తప్పలేదు. అమ్మ నాన్నగార్నిరి చూడ్డానికి వెళుతూ, రాధికనుకలుసు కోడం జరిగింది." అన్నాను.

"నన్ను చేసుకోడం మీ తల్లి దండ్రులకు ఎందుకు ఇష్టం లేక పోయింది. ? "

"అప్పట్లో నాకు వివాహేఛ్ఛలేదు 'ఉన్న ఒక్క నలుసునీ వివాహం చేసుకోకపోతే ఎలా ? అంటూ సెల వులకు వెళ్ళినప్పుడు, అమ్మ నాన్న గారు ఒక అమ్మాయిని చూపించేరు సరిగ్గా చూడనేలేదు. వేడివేడిఇడ్లీలో కమ్మటినెయ్యి, కొబ్బరి పచ్చడివేసి తెచ్చేరు. పెద్దగ్లాసు నిండుగా పాలు ఇచ్చారు. అవితీసుకుని వచ్చేసేను తర్వాత సెలవుల్లో ఇంటికివెళ్ళడం మానేసేను. 'మదర్' సీరియస్‌స్టార్ట్ ఇమీడియట్లీ' — టెలిగ్రాంవచ్చింది వెంటనే బయల్దేరేను. అమ్మ ఆరోగ్యంగా తిరుగుతూంది. నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. నాన్న గార్ని అడిగే ధైర్యం లేకపోయింది చాటుగా అమ్మనిఅడిగేను.

"సెలవుల్లో రావడంలేదు. చూడా

లని పించిదేమో ? నాన్నగార్నే అడుగు" అంది అమ్మ.

నాలుగుగంటలయ్యే సరికి ఇద్దరు పెద్దమనుష్యులువచ్చేరు. నాన్నగారు నన్నువాళ్ళకి పరిచయం చేసేరు. అప్పుడు అర్థంఅయ్యింది. అమాయక మైన వదనం, విశాలమైనకనుదోయి, సన్నగా నాజూగ్గా బంగారుతీగలా ఉన్న నీ అందం నన్ను ముగ్ధుణ్ణి చేసింది. ఎంతఅయిష్టంగా వచ్చేనో, తొలిచూపులోనే ఆ కట్టుకున్నావు. వివాహం నిశ్చయించండని చెప్పి వెళ్ళిపోయేను. రెండునెలలుదాటినా, ఆ విషయం నాన్నగారు ఉత్తరం వ్రాయలేదు. ఆతృతగా ఇంటికి ఉత్తరంవ్రాసేను. దానికిబదులు మళ్ళీ పెళ్ళిచూపులు ఏర్పాటు చేసేం, రమ్మని ఉత్తరంవచ్చింది. వెళ్ళగానే రాధవాళ్ళసంబంధ ఏమైందనిఅడిగేను

"తండ్రిరోగిష్టివాడు, వ్య స న పరుడుఅని, వాళ్ళ సంప్రదాయం మంచిది కాదని తెలిసింది. అది కుదిరేది కాదు." అన్నారు నాన్న గారు.

"తండ్రి వ్యసన పరుడైతే రాధ బాధ్యురాలా ? ఆ అమ్మాయితప్పేం ఉంది ?" అన్నాను.

మనది అగ్నిహోత్రం కడిగే వంశంరా ! అది ఎంతమాత్రంవీల్లేదు లక్షణంగా మనఊళ్ళో సూరావధాన్ల గారి అమ్మాయిని చేసుకోరా ! ముందేవీళ్ళువచ్చిసట్లయితే ఆ రాధని చూపించేవాళ్ళమేకాదు." అందిఅమ్మ

"నేను ఇంకెవర్నీ చూడదల్చుకో లేదు'' అది నానిర్ణయం చెప్పివెళ్ళి పోయేను. ఎవరికి ఇష్టంలేకపోయిన నిన్నే చేసుకోవాలన్న నిర్ణయంతో మీ ఊరువచ్చేసేను.

"అప్పుడు మీరు ఏఊరువెళ్లేరు?" కుతూహలంగా ప్రశ్నించేను.

రాధ ఒక్కనిట్టూర్పు విడిచింది. ఫ్లవర్ వేజ్‌లో బూగన్ విలియా పువ్వుల్ని సరిచేసి చెప్పడం మొదలు పెట్టింది.

"నాన్నగారి జీతం తక్కువ. త్రాగుడుఎక్కువ. ఊళ్ళో విపరీతంగా

అప్పులు, నాకు ఊహ తెలిసిన దగ్గరనుంచీ నాన్నగారి సంగతి గ్రహించేదాన్ని. నాకు సంగీతం అంటే, ఎక్కువఇష్టం. ఆ తండ్రి వల్ల నాకే కోరికలు తీరేవికావు. ఆయన పరిస్థితిచూచి అమ్మగోల పెట్టేది. 'ఉన్న ఒక్కఆడపిల్లకీ వివాహం చెయ్యండి బాధ్యతతీరి పోతుంది,' అని. కాని ఆయనేం పట్టించుకోలేదు. నాన్నగారు తీసుకో వలసిన బాధ్యతఅంతా, నాపెళ్ళికోసం తనమీద వేసుకుంది. తెలిసినవాళ్ళ ద్వారా, మీ సంబంధం మాట్లా డించింది."

పెళ్ళి చూపులనాడు నాన్నగారు లేకపోడం మీకు గుర్తుందా ?" మధ్యలో ఆపేసి ప్రశ్నించింది.

"ఆ! ఏదో ఊరు వెళ్ళేరని, ఆఫీసు పనిమీద వెళ్ళక తప్పలేదని చెప్పినట్లుగుర్తు."

"అదేంకాదు బాధ్యతా రహితంగా వెళ్ళిపోయేరు. తర్వాత నాన్నగారి విషయం మీవాళ్ళకి తెలిసిందేమో ! మరి రెండునెలలకే నాన్నగారు గుండె పోటుకి గురై మరణించేరు స్వంత మేనమామకాదు. వరసకి అమ్మకి తమ్ముడు, ఈ విషయం తెలిసి వచ్చేడు. ఇల్లు అమ్మేసి అప్పులన్నీ తీర్చేసి, మమ్మల్ని తనతో హైదరా బాద్ తీసికెళ్ళాడు. అమ్మకి ఎంత మాత్రం ఊరువదిలి వెళ్ళడం ఇష్టం లేదు. కాని ఎదురుచెప్పలేని నిస్స హాయత, వంటరితనం వల్ల వెళ్ళక తప్పలేదు. అక్కడ మామయ్య నా ఇష్ట ప్రకారం సంగీతం నేర్పించేడు స్కూల్లో కొంతనేర్చుకోడం వల్ల, తొందరగానే పట్టుపడ్డాది. జీవితంలో అమ్మ కోర్కెలూ, అభిలాషలూ మట్టిలోకలిసిపోయేయి. జీవశ్చవంలా ఉండేది. కూతురు చక్కగా కాపురం చేసుకుంటూంటే, చూచి ఆనందించా లని ఆశపడ్డాది. తాను బ్రతికిఉండగా నాకు వివాహం కాకపోతే, నా భవి ష్యత్తు ఏమవుతుందో, అద్దంలో కని పించినట్లు చెప్పేసేది. అదంతాఅమ్మ చాదస్తం అనుకునేదాన్ని.

"ఒరే తమ్ముడూ ! ఈ సంగీతం మాటకేంలే! రాధకి ఆ మూడుముళ్లూ వేయించరా ! నీకుపుణ్యంఉంటుంది."

అని ప్రాధేయ పడేది. ఈ వాక్యం చదువుకునే దాన్ని. ఎప్పటికైనా నన్ను వెతుక్కుంటూ వస్తారన్న నమ్మకంతో ఎదురు చూసేదాన్ని. ఈ విషయాలన్నీ మీకు వ్రాద్దాం అంటే, మీ ఎడ్రసు తెలీదు. నా నమ్మకం వృధాపోలేదు. కాని చాలా ఆలస్యంగా కలిసేం" అని బూగన్ విలియా పుష్పాల గుత్తి సర్దుతూనే నిట్టూర్పు విడిచింది."

"రాధ నాకూతురులాంటిది. దాని బాధ్యత నాకు విడిచిపెట్టి, నువ్వు నిశ్చింతగాఉండు. భేషైన సంబంధం తెస్తాను." అంటూనే మామయ్య కాలం గడిపేడు. నా పెళ్ళిబెంగతోనే అమ్మ కన్నుమూసింది. నిజంచెప్పా లంటే, మందులేక మామయ్యే చంపేసేడు. నేను సంగీతం శ్రద్ధగా నేర్చుకునేదాన్ని. రాత్రీ పగలూ సంగీతం తప్పవేరే ధ్యాసలేదు. అందులోనే నామనస్సుకి శాంతిలభిం చేది. అమ్మపోవడంతో మామయ్య విజృంభించేడు. అతని హావ భావ చేష్టలు నాకు కృత్రిమంగా గోచరించేవి

"సాయంత్రం పెళ్ళివారు వస్తారు రడీగా ఉండు," అన్నాడుమామయ్య నాగుండె గుభేలుమంది ఈ వాక్యం చదివేను. సంతకం చూస్తే ఏదో అర్ధంఅయినట్లు తోచింది. చూపు లయ్యేయి. వచ్చింది అబ్బాయికాదు నడివయస్సుదాటిన మనిషి. నెరిసిన జుట్టు, నల్లటిరంగు చాలా వికృతం గా కనిపించేడు.

"మామయ్యా ! నన్ను ఇతనికి కట్టబెడతావా ! నేను నీకేం అపకారం చేసేను ? నీకిది న్యాయంగా ఉందా? నాకు పెళ్ళిమీద మోజులేదు. ఉద్యో గ్యం చేసుకుని బ్రతుకుతాను. నీకు సహాయకారిగా ఉంటాను," అని అర్ధించేను.

"మీ అమ్మకిచ్చిన మాటతప్ప లేదు. నీ ఇష్టప్రకారం సంగీతం నేర్పించేను. నాఇష్టప్రకారం అతన్ని పెళ్ళిచేసుకోక తప్పదు," అన్నాడు.

"అమ్మకోరింది ఇలాంటి వివాహంకాదు. ఇంతకన్న వివాహం చెయ్యకపోతేనే, స్వర్గంలో ఉన్న

అమ్మ మనస్సుకి శాంతిలభిస్తుంది," అన్నాను దు:ఖాన్ని దిగమింగుతూ!

"మొదటి భార్యపోయి రెండు నెలలే అయ్యింది. అలా కనిపిస్తాడే కానిముప్పైకూడా నిండలేదు. ఇంత కన్న మంచిది నేనెలాతేగలను ? నీ మీద మోజుతో కట్నంలేకుండా చేసు కుంటా నంటున్నాడు," అన్నాడు రౌద్రంగా !

వివాహం టూకీగా జరిగిపోయింది అతనికి నామీద ఎప్పుడూ అను మానమే. వేధించుకు తినేవాడు. ఆ పరిస్థితుల్లో నాకు దైవదత్తమైన సంగీతమే శరణ్యమైంది ఒకరోజు ఒళ్లు తెలీకుండా, నాదబ్రిహ్మ త్యాగ య్య ఫోటోముందు కూర్చుని, ఆభేరి రాగం ఆలాపనచేసి, 'నీ నగు ము గనలేని నా జాలి .... ఖగరాజుని యానను విని వేగ చనలేదో .... గగనానికి ఇలకూ బహుదూరం బని నావో ! .... ' పా ట లో లీన మయ్యేను. నాకను ద్వయంలో ఆనంద భాష్పాలు ఉబికేయి. కిటికీ లోంచి ఒకరాయివచ్చి నానుదుటికి కొట్టుకుంది. బాహ్యంలోకి వచ్చేను. నుదురు బొప్పికట్టి చిట్లింది. కిటికీ లోంచి ఆయన కనిపించేరు. వెళ్ళి తలుపు తెరిచేను.

"ఏమే ; అంత ఒళ్లు మైమరిచి పోయేవు. కిటికీలోంచి మనుష్యులు చూస్తున్నా తెలీలేదు. భోగందానివా ఏమిటాపాట ? పిండిలా సాగదీస్తు న్నావు. మళ్ళీ ఎప్పుడైనా ఇలా జరి గిందా ? ఏం చేస్తానో చూడు," అని మండి పడ్డారు. కళని నిందించగానే మరి ఊరుకో లేకపోయేను.

"దైవదత్తమైన సంగీతంఅందరికీ అబ్బుతుందా ! సాగ దియ్యడం ఏమిటి ! ఆరోహణ అవరోహణల మేళవింపుతో, లయబద్ధంగా భగవం తుని ప్రార్థించడం తప్పా ? అందు లో ఆనందం మీకేం తెలుసు ? కిటికీలోంచి ఎవరు చూసేరోనాకేం తెలీదు. అయినా కళ ఒక్కరికే పరి మితంకాదు." ఉక్రోషంగా అన్నాను.

నీకెంత ధైర్యం ? నాకే ఎదురు చెప్తావా ? నీ అందానికి ముప్ఫయి వేలు సమర్పించేను. ని న్నే ం

చేస్తానోచూడు," మూలనున్న కర్ర నా వీపుమీద నర్తించింది. నాకడుపులో జీవం గడగడ వణికింది 'రామా !" అంటూ కూలిపోయేను. అంత ఆబాధలో మామయ్య వికృతరూపం, నాకళ్ళముందు వికటాట్టహాసం చేస్తూ, గోచరించింది, మర్నాడు ఇద్దరుస్త్రీలను వెంటతీసుకొచ్చేరు. రెండు రోజులు గడివదిలి రాలేదు. సీసాలు కాళీఅవుతున్నాయి మాటి మాటికి చిప్పవేయించితెమ్మనీ పురమాయింపు. నన్ను దాసీ దానికన్నా హీనంగా ఉపయోగించుకున్నారు. నా హృదయం భగభగ మండిపోయింది. అమ్మనితల్చుకుని బావురుమన్నాను. కాలం గడిచింది పాపని ప్రసవించేను. ఈ నరరూప రాక్షసుడు పసిదాన్ని ఏంచేస్తాడో ? నన్ను ఏ మలుపు త్రిప్పుతాడో ? అంతడబ్బుపోసి కొన్నప్పుడు నాపై సర్వహక్కులూ అతనివే ! ఆలోచించేను.

తూర్పు కొండమీద ఎర్రరంగు పులుముకుంది. గమ్యంలేని ప్రయాణం సాగించేను. ఏదో స్టేషనులో తెల్లటిపంచె లాల్చీతో, రమారమి అరవై సంవత్సరాల మనిషి, శాంతి దూతలా నాపెట్టెలోకి ఎక్కేరు. నా ఎదురు సీట్లోకూర్చున్నారు.

'నిన్ను సికింద్రాబాద్ స్టేషనులో చూసేనమ్మా. నీవదనంలో భావాలు పరిశీలిస్తే, ఏవో పరిస్థితుల వత్తిడి వల్ల, ఒంటరిగా చేతిపిల్లతో ప్రయాణం చేస్తున్నట్లు అనిపించింది. ఆ జన సమూహంలో నువ్వే పెట్టెలో ఎక్కేవో చూడలేదు. ప్రతీ స్టేషను లోనూదిగి నువ్వే పెట్టెలో ఉన్నావో పరిశీలిస్తున్నాను. ఇప్పటికి దొరికేవు తండ్రిలాంటి వాణ్ణి చెప్పమ్మా ! ఏఊరు వెళుతున్నావు ? అన్నారు.

ఆలాలనలో నాకు దైవతం గోచరించింది. నా పరిస్థితి అంతా వివరించేను. సంగీతం డిప్లమోతీసుకున్నాను. నాకేదైనా ఉద్యోగం ఇప్పించండి. అనీ ప్రాధేయపడ్డాను

"మరీ మంచిది మా స్కూల్లోనే చెయ్యవచ్చు. నాకు ఆస్థి చాలానే ఉంది. మా అమ్మాయి కల్యాణి

ఐదవ ఏటనే, లయవేస్తూ పాటలు పాడేది. దానిఇష్టం తెలుకుసి, సంగీతం నేర్పించేను. ఎన్నో కచ్చేరీలు చేసింది. ఖ్యాతి నార్జించింది. ఓరోజు పాట మధ్యలో, గొంతుపూడుకు పోయింది. డాక్టరు ప రి క్ష చే సి "కేన్సరు" అన్నాడు. మిన్నువిరిగి మీద పడ్డాది. కొన్నాళ్ళు వైద్యం. చేయించేం తగ్గలేదు. బొంబాయితీసి కెళ్ళి స్పెషలిస్టులకు చూపించేం. అప్పటికే ఆలస్యం అయిందన్నారు. ఎన్ని వైద్యాలు చేయించినా, లాభం లేకపోయింది. మమ్మల్ని అన్యాయం చేసి వెళ్ళిపోయింది. అమ్మాయి పేరుతో ఒక సంగీతం స్కూలు తెరిచేను. సరైన టీచరులేక పిల్లలు మానేస్తున్నారు. నాతో రామ్మా ! నీకు ఏ సమస్యరాకుండా చూసేభారం నాది." ఆప్యాయంగా అన్నారు కళ్ళు వత్తుకుంటూ.

ఏనాడూ తండ్రి ఆప్యాయత తెలీని నేను కరిగిపోయేను. ఆయన లో నాన్నగార్ని ఊహించుకున్నాను. ఆయనవెంట ఈ కాకినాడ వచ్చేను. ఇక్కడే స్థిరపడ్డాను. రాధికను ఇంత దాన్ని చేసేను. ఈమధ్యే ఆ బాబు గారుకూడా పోయేరు."

రాధ నేత్రాలు అవిరామంగా వర్షించేయి. ఫ్లవర్ వేజ్ మీద తల వాల్చింది. ఎలా ఓదార్చాలోతెలీలేదు ఏభై ఏళ్ళ మనిషిని తికమకపడ్డాను. రాధ జీవితాన్ని ఎంతో ఉన్నతంగా ఊహించేను. ఇదా రాధ జీవితం ! నామనస్సు ఎంతో బాధపడ్డాది. నా గుండె బరువెక్కింది.

"ఊరుకో రాధా, నీ జీవితంఇలా కావడానికి, నేనూ కొంత బాధ్యుణ్ణే అనిపిస్తూంది. జరిగినదానికి బాధపడి ఏం లాభం ? ఇటుపైనువ్వు ఒంటరిగా ఇలా దిక్కులేకుండా ఉండడానికి వీల్లేదు. దీనికి ఒకేఒక్క మార్గం ఉంది. నాపాపపరిహారం కోసం రాదికను నాకోడలిగా చేసు కుంటాను. నువ్వు అడ్డు చెప్పకు" అన్నాను.

రాధ వేదాంతిలానవ్వింది. అందులో నాకేదో మర్మగర్భితమైన రహస్యం ఇమిడిఉన్నట్లుతోచింది. ఒక్కమారు రాధవదనంలోకి ప రీ క్ష గా చూసేను.

"ఎందుకు అలానవ్వుతున్నావు?" ప్రశ్నించేను.

"మీరు తొందరపడుతున్నారేమో?

ఆ పసిదాని హృదయంలో కూడా ఆశలు రేకెత్తించడం దేనికి ? అప్పుడు కులం గోత్రం వంశం అని అడ్డు చెప్పిన మీపెద్దలు ఇప్పుడు మాత్రం అడ్డు చెప్పరంటారా ? మీ వెర్రికాని, మీభార్య కూడా అకోవకి చెందిన మనిషేగా ? అప్పుడు ఇద్దరే కాని ఇప్పుడు ముగ్గురు. బలం ఎటు వేపు ఉందంటారు ? "

నా గుండెలో మండుతున్న అగ్ని గోళాన్ని నువ్వు చూడలేవురాధా ! నాకు కావలసింది కులం గోత్రం వంశంకాదు. నేను అన్యాయాన్ని సహించలేను. అప్పుడు అన్నీ తెలుసుకుని వచ్చేసరికి ఆలస్యంఅయిపోయింది. కాని ఇప్పుడు రాధికను విధికి వదిలివేసేటంత మూర్ఖుణ్ణిఅసమర్థుణ్ణి కాను. ఈవిథంగా ఆత్మ ప్రక్షాళన చేసుకోనీ" ఆవేశంగా అన్నాను.

" కావచ్చు, మీ అభ్యుదయ భావానికి అంతస్తుల తేడాలేకపోవచ్చు. అంతమాత్రం చేత, ఏవేవో చేసేస్తానను కోడం భ్రమ" అందిరాధ

"కాదు మళ్లీ వస్తాను." అని వెళ్ళడానికి ఉపక్రమిస్తూ, మరొక్కమారు 'వస్తాను' అని చెప్పి వెనుదిరిగేను. ఇంతలో రాధ ఫ్లవర్ వేజ్ లో ఉన్న బూగన్ విలియా పువ్వుల గుత్తి తీసి నాకు అందించింది. రోడ్డు మీదనడుస్తూ, వాసనలేనిపువ్వులగుత్తి నాకుఅందించినకారణం ఆలోచించేను.

బూగన్ విలియా పువ్వుల్ని కాగితం పువ్వులు అంటారు, కొన్ని పెద్దవి, కొన్నిచిన్నవి, కొన్ని విడీ విడనివి, రకరకాల రంగురంగుల పువ్వులు, జీవంలేక మధ్యలోనే రాలి పోతూ ఉంటాయి. భగవంతుడు సృష్టించిన మానవజీవితాలు కూడా, ఈ కాగితం. పువ్వుల వంటివే ! జీవంలేని ఈ బూగన్ విలియా పువ్వులు చిగురించనట్లే, కొన్ని మానవ జీవితాలు చిగురించవు. అందుకే రాధ, మానవజీవితాలకు చిహ్నమైన, వాసనలేని ఈ కాగితం పువ్వుల్ని నాకు ఇచ్చింది. ఫ్లవర్ వేజ్ లో ఉన్న పువ్వులవేపేచూస్తూ, అవిసవరిస్తూ తన గాధ వివరించింది చివరిగా ఆ పువ్వులమీద వాలిపోయి దు:ఖించింది. నగ్నసత్యం చాలాఆలస్యంగా స్ఫురించడంతో ఒక్క గాఢమైన నిట్టూర్పు విడిచేను : ....

—O—